# వెంకటలక్ష్మి పరిష్కారం

పి. అరుణా రవిశంకర్

**కళ్ళు మూస్తే శశిరేఖ.**

కళ్ళు తెరిస్తే వెంకటలక్ష్మి.


చిత్రమైన సమస్యే. కనుచూపు మేరలో దీనికి పరిష్కారం ఏదీ? అడకత్తెరలో పోకచెక్కలా నలిగిపోలేదు కానీ అంతకంటే ఎక్కువగానే బాధపడిపోయాడు రాజారావ్.


సెలవుల్లో శశిరేఖను వదిలి ఆ వూర్నించి కదలాలంటే రాజారావ్‌కు మనస్కరించ లేదు. అతి కష్టం మీదనే శశిరేఖ చేతిని వదిలాడు. తర్వాత వారానికో ఉత్తరాన్ని ఒకరికొకరు విడకుండా రాసుకునే షరతు మీద.

శశిరేఖ కూడా ఆ షరతును వుల్లంఘించ లేదు. ముందుగా రాజారావే ఉత్తరాన్ని రాశాడు. ఆ రాత్రి అతడి తల్లి గాఢ నిద్రలో మునిగిపోయిందని నిర్ధారణ చేసుకున్న తర్వాత...

ఆ ఉత్తరం చేరగానే శశిరేఖ వెంటనే ఉత్తరం తిరుగు టపాలోనే రాసింది.

అదృష్టమే- పోస్టుమేన్ శశిరేఖ రాసిన ఆ ఉత్తరాన్ని భద్రంగా మోసుకొచ్చినప్పుడు రాజారావ్ ఒక్కడే



ఇంట్లో వున్నాడు. అతడి తల్లి ఎవరింటికో వెళ్ళింది.

హుషారుగా శశిరేఖ రాసిన ఆ ప్రణయ లేఖను చదువుకున్నాడు రాజారావ్.

మై డియర్ రాజా

నీ ఉత్తరం అందింది. నాకు దూరంగా నువ్వెంత వేదనను అనుభవిస్తున్నావో పూర్తిగా అలాంటి బాధనే నేనూ అనుభవిస్తున్నాను. నాకు పిచ్చెక్కినట్టుగా వుంటోంది నిన్ను చూడకుండా క్షణం కూడా జీవించలేనని అనిపిస్తోంది. ప్లీజ్.... త్వరలోనే నిన్ను కలుసుకోవాలి... నిన్ను చూడాలి.... ఇందుకోసం ఏదయినా ఏర్పాటు చూడు.... నీ ఉత్తరం కోసం ఎదురు చూస్తూ ఉంటాను-

ఆ ఉత్తరాన్ని ఐదుసార్లు చదివాడు రాజారావ్.

అతను ఆ ఉత్తరాన్ని జాగ్రత్తగా దాచిన తర్వాత తల్లి వచ్చి "పోస్ట్‌మేన్ చెప్పాడు.... ఎక్కడి నించి ఉత్తరం

వచ్చిందట?" అనడిగింది. ఉలిక్కి పడ్డాడు రాజారావు.

ఆమెకి అనుమానం బాగానే ఎక్కువ. ప్రతి చిన్న విషయాన్నీ అనుమానించటమే ఆమె ధ్యేయం. ముందు అనుమానం పుట్టి తర్వాత ఆమె పుట్టిందని రాజారావ్‌తో ఎవరో ఇంతకు ముందో సారి చెప్పారు.

అందుకే- "మనక్కాదు.... ముందు మన ఉత్తరం అనుకుని నాకిచ్చాడు. తర్వాత మనది కాదని దాన్ని అతనికే ఇచ్చేశాను" అన్నాడు రాజారావ్ సమయస్ఫూర్తిగా-

అప్పుడామె ఉత్తరం అంటే మీ మామయ్య దగ్గర్నించి వచ్చిందేమో అనుకున్నాను" అన్నది అనుమానంగానే చూస్తూ.

మామయ్య అనేసరికి చిన్నగానే ఉలిక్కిపడ్డాడు.

ఆ మామయ్య కూతురే వెంకటలక్ష్మి ఇప్పుడామె తరచుగా రాజారావ్ కళ్ళ ముందే కదులుతోంది.

వెంకటలక్ష్మి పేరు చెప్పి తల్లి రాజారావును రోజుకో చాలాసార్లు భయపెడుతూనే ఉంది.

శశిరేఖ కాలేజీలో చదువుతున్నప్పుడు అతడి జీవితం లోకి ప్రవేశించకుండా ఉండే రాజారావు- వెంకటలక్ష్మి గురించి అంతగా భయపడేవాడు కాదు.

ఒక వరలో రెండు కత్తులా?

ఒకటి- శశిరేఖ

రెండు- వెంకటలక్ష్మి.

శశిరేఖ- రాజారావ్ హృదయాన్ని దోచుకుని అందులో తన స్థానాన్ని శాశ్వతం చేసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్న ఓ అందమైన పువ్వులాంటి యువతి-

వెంకటలక్ష్మి- అతడి తల్లి మనసును ప్రేమను- ఇష్టాన్ని చూరగొని ఆ ఇంటి కోడలిగా రావడానికి ఆమె మనసులో ఐ స్థానాన్ని యేర్పరచుకున్న అందాల బొమ్మ....

ఇంతకీ ఆ యింటి దీపం ఎవరు?

శశిరేఖా?

వెంకటలక్ష్మా?

ఎవరు? ఎవరు?

ఈ సమస్య రాజారావుకే- అతడి తల్లి కేమీ కాదు. అందుకే ఏనాడూ తన మాట కాదన్న కొడుకు వెంకటలక్ష్మిని- తన తమ్ముడి కూతుర్నే ఆ ఇంటి ముంగిట ముత్యాలముగ్గు వెయ్యడానికి కొంగుముడి వేసుకుని తీసుకువస్తాడనే పూర్తి నమ్మకంతో ఉన్నది.

కాని- ఇక్కడ- మరోవైపు- రాజారావ్ ఆమె ఆశలన్నింటినీ సమూలంగా ఆమెకి తెలికుండానే నరికివేస్తూ శశిరేఖను రంగుల కలల్లో ఇరికించుకుని ఎక్కడో దూరంగా నదీతీరాల్లో, ఉద్యానవనాల్లో విహారాలు చేస్తున్నాడు.


ఇంతకీ జరిగేదేమిటి?

అతడికీ సస్పెన్స్‌గానే ఉంది.

ముందుగా ఈ సస్పెన్స్ గురించి శశిరేఖతో చెబితే ఎలా వుంటుందో అనుకున్నాడు. ఆమె నుంచి ఉత్తరం అందుకున్న ఆ రాత్రి డాబా మీద ఆరుబయట గుడ్డి వెన్నెల్లో పడుకుని-

కాని- ఆమె బాధపడదూ? ఈ కథంతా తెలిసి పక్కా ఫార్ములా తెలుగు సినిమాలో లాగా అర్థంలేని ముష్టి






త్యాగాన్ని చేస్తు ఏ గుడ్డి వెధవనో పెళ్ళి చేసుకుని ఎటో వెళ్ళిపోతే?

ఇలా అనుకున్న తర్వాత వెంకటలక్ష్మి గురించి శశిరేఖతో చెప్పాలనిపించలేదు.

మరేమిటి చెయ్యటం!

వెంకటలక్ష్మి మీద అతడికేమీ ప్రేమ లేదు- ఇష్టం లేదు- కాని ఉన్నదంతా అతని తల్లికే వున్నది. తల్లి మాటను కాదనే ధైర్యం- ధైర్యం కాదు గానీ, మనసు మాత్రం రాజారావుకు లేదు.

ఎందుకంటే చిన్నతనంలోనే తండ్రి ఈ లోకంతో బంధాలన్నింటినీ తెంచుకుని చుక్కల లోకానికి ఎగిరిపోతే ఆమె అతడికి తండ్రి ప్రేమను కూడా చూపించింది, ఒక మనిషిలోనే టూ-ఇన్-వన్‌లా ఇద్దరి మనుషుల ప్రేమలను అతడికి చూపించిన తల్లి కోరికను నిర్దాక్షిణ్యంగా కాలదన్నడం అతనికి ఏ మాత్రం న్యాయమనిపించలేదు.

మరి- మనసుకి నచ్చిన అమ్మాయిని వదిలి మరో మనిషి కోసం వెంకటలక్ష్మిని తన లైఫ్ పార్టనర్‌గా చేసుకోగలడా?

మరి శశిరేఖ సంగతేమిటి?

ఎంతగా ఆలోచించినా కథ మళ్ళీ మొదటికొస్తోంది... భూమి గుండ్రమని పదే పదే తెలుస్తోంది....

ఈ కథలో శశిరేఖ పాత్ర ఏమిటి?


ఒకవేళ శశిరేఖకే పూర్తి ఇంపార్టెన్స్ ఇస్తే వెంకటలక్ష్మి సంగతేమిటి?

అతను ఆ రాత్రి నిద్రకు దూరమైనాడు.

శశిరేఖ- తను కలుసుకునే ఏర్పాటు గురించి ఆమెకు క్లియర్‌గా ఓ ఉత్తరం రాసేశాడు....

ఓ మూడు రోజులపాటు ఊహించకుండానే రాజారావు తల్లి ఓ మాదిరి తీవ్రమయిన అనారోగ్యానికి గురయ్యింది.

"మామయ్యకు కబురు చెయ్యమంటావా?" అడిగాడు రాజారావ్.



## రచయితలున్నారు జాగ్రత్త!

ఒక పెద్దపేరున్న రచయిత తన స్నేహితుడికి తన గురించి చెప్తున్నాడు.

"తమాషా ఏమిటంటే- పదేళ్ళ తరువాత- నాకు తెలిసొచ్చింది- అదేంటంటే నాకసలు రాయటం రాదనీ, నేను రచయితను కాలేననీనూ!"

"అప్పుడు మరిరచనలు చేయగంమానేశావా?" ఆత్రుతగా అడిగాడతని స్నేహితుడు.

"ఎలా మానటం? అప్పటికే నాకు మరీ పేరు ప్రఖ్యాతులొచ్చేశాయ్ కదా!"

---

"వద్దులే... రెండ్రోజుల్లో అంతా సర్దుకుంటుంది.... వయసు ముదురుతోంది కదా... ఇలాంటి వొడుదుడుకులు మామూలే. నువ్వు కంగారుపడకు" అన్నది.

ఆరోజే - ఆ రోజునే రాజారావు - శశిరేఖను కలుసుకుంటానని ఉత్తరంలో రాసిన రోజు.

రాసినట్టుగానే ఆఊరికి ఓ మైలున్నర దూరంలో ఉన్న చిన్న టవున్లో ఉదయం పదిన్నర కావస్తున్నప్పుడు అతను శశిరేఖను కలుసుకున్నాడు. అతడ్ని చూడడంతోనే శశిరేఖ కళ్ళు నక్షత్రాల్లా మెరిశాయి.... మొహం విప్పారింది.

బావుండదని ఊరుకుంది గానీ లేకపోతే చాలా రోజులకు కలుసుకున్న ప్రేమికులు సినిమాల్లో ఎలా ప్రవర్తిస్తారో అలాగే తనూ చెయ్యాలనుకుంది శశిరేఖ...

మై గాడ్.... ఎన్నో రోజులయినట్టుంది నిన్ను చూసి.... నిజంగా హెల్ ...నువ్వెలా వుండగలిగావో... నాకయితే ఇప్పుడే నీతో మీ ఊరు వచ్చి శాశ్వతంగా నీతోనే వుండిపోవాలని అనిపిస్తోంది..."

నవ్వాడు రాజారావ్.

ఈ శశిరేఖకు ఆ వెంకటలక్ష్మి గురించి తెలిస్తే ఇలా మాట్లాడగలదా? అనిపించింది....

ఈ మనుషులు ఎంత చిత్రమైనవాళ్లు! హ్యూమన్ రిలేషన్స్ చాలా దారుణమైనవి.... అవి మనుషులను ఎన్నో రకాల సమస్యల్లోకి నెట్టి నవ్వుకుంటూ ఉంటాయి- అనుకున్నాడు...

లేకపోతే- సిటీలో ఉండి అన్నేళ్ళు కాలేజిలో చదివిన తను ఏదో ఓ అమ్మాయితో ప్రేమాయణం సాగించి ఉండవచ్చుననే ఆలోచన తన తల్లికి పొరపాటున కూడా ఎందుకు రాలేదు?

వెంకటలక్ష్మిని తన ఇంటి కోడలుగా చెయ్యాలని తన తల్లి గాఢంగా కోరుకుంటుందని తెలిసి కూడా తను శశిరేఖ ప్రేమలో ఎందుకు పడిపోయాడు?

ఈ సమస్యకు అసలు కారణం ఇద్దరిలో ఎవరు?

ఒక రకంగా తనే-




# క్రివేణి® ఇంకు గమ్ ఆఫీసు పేస్ట్







వాడి, వాటి విశిష్ఠతను గమనించండి.

IS:1221-71

ISI

తయారుచేయువారు:

కృష్ణవేణి ఇంకు ఫ్యాక్టరీ

751, తిరువత్తియూర్ హై రోడ్, మద్రాసు-600 081

# సీతారామాంజనేయ సంవాదము

శ్రీ పరశురామ పంతుల లింగమూర్తి గురుమూర్తి ప్రణీతము

(శ్రీ వజ్ఝల నారాయణ శాస్త్రిలవారి టీకా తాత్పర్యసహిత విశేషవ్యాఖ్యలతో)

ఇందులో :

సర్వాత్మ భావనము- వైరాగ్య స్వరూపము-చతుర్వింశతితత్త్వము- పరమాత్మ స్వప్రకాశత్వము-ఓంకార స్వరూపాది నిరూపణలు-వర్ణాశ్రమధర్మ వివేచనము- శ్రీరామ మంత్ర మహాత్మ్యము-శ్రీ రామచంద్ర దర్శనా సౌలభ్యసూత్ర యోగము-యోగ భేదములు-అభ్యాస నియమములు- ఖేచరాదిముద్రలు-దశవిధ ప్రణవనాదములు-ఈశ్వరుని విరాట్స్వరూపము-జీవబ్రహ్మైక్య విచారము-నైమిత్తిక ప్రళయ స్వరూపము మొదలగునవి సవివరణములుగా పొందుపరచబడినవి.

శ్రీ వేదం వేంకటరాయ శాస్త్రిగారి సుదీర్ఘ పీఠిక-శ్రీబాపుగారి త్రివర్ణ ముఖపత్రం అమూల్య అలంకారాలు! అందమైన ప్లాస్టిక్ కవరుతో

వెల రూ. 50-00

ఎం.ఒ. ద్వారా రు. 45-00 లు పంపినవారికి మిగతా రు. 5-00 లకే వి.పి.పి. ద్వారా పంపబడుతుంది.

## శ్రీ అరుణా బుక్ హౌస్

నెం.103, నారాయణ మొదలి వీధి, మద్రాసు-600079.

ఐనా ఇప్పుడు చెయ్యగలిగింది ఏముంది?

శశిరేఖే ఓ రెండు గంటలపాటు ఏవో కబుర్లు చెప్పింది. అన్ని గంటల కబుర్ల సారాంశం ఒక్కటే.

డియర్ రాజా– నువ్వు లేకుండా నేను బతకలేను. వీలయినంత త్వరలో నన్ను నీదాన్నిగా చేసుకో. లేకపోతే నా అంతట నేనే నీ ఇంటి కొచ్చేస్తాను– ఇదీ....

శశిరేఖను ఒప్పించి తనూ ఇంటి కొచ్చాడు.

"ఎక్కడికెళ్ళావ్?" తల్లి అడిగింది.

ఎవరో ఫ్రెండ్‌ను కలవటానికి వెళ్ళి నట్టుగా చెప్పాడు.

ఆ రాత్రి రాజారావ్ తల్లి ఆరోగ్యం మళ్ళీ దెబ్బ తిన్నది. అతను భయ పడ్డాడు.... అతనే కాదు. ఆమె కూడా భయపడింది భయపడే తన తమ్ముడికి కబురు చెయ్యమన్నది. కబురు చెయ్య మన్నదే కానీ అయనొచ్చే వరకు ఆమె ప్రాణం నిలవలేదు ఎగిరిపోయింది.... తల్లి మీద పడి విలపించాడు రాజారావ్.

మామయ్యొచ్చాడు. ఒక్కడే రాలేదు. భార్యతో కూతురు వెంకటలక్ష్మితో వచ్చాడు.... అంతా కలసి రాజారావ్‌ను ఓదార్చే ప్రయత్నాలు బాగానే చేశారు.

ఇప్పుడో రకంగా రాజారావ్ సమస్యకు పరిష్కారం దొరికింది. ఐతే అది నిజంగా పరిష్కారమని అతను అనుకోలేదు. అలా చేస్తే తన తల్లి ఆత్మకు శాంతి లేకుండా చెయ్యటమే.

రాజారావ్ తల్లి ఊరికే చావ లేదు. వెంకటలక్ష్మి కూడా అతడిని చేసుకో వాలని వుందనీ అందువల్ల ఆ అమ్మా యినే అతడు పెళ్ళి చేసుకోవాలనీ– అలాగని అతడి దగ్గర మాట తీసుకున్న తర్వాతనే ఆమె ప్రాణాలు విడిచింది.

తల్లి పోయిందని తనిలా మాట తప్పాలనుకోడం న్యాయమా?

రాజారావ్ తల్లి చనిపోయింది.

కాని సమస్య అలాగే వుంది... ఆ సమస్యను ఆమె చావనివ్వకుండా మరింత ఊపిరి పోసి మరీ పోయింది.

భగవాన్! ఏమిటీ సమస్య? అని ఎదురుగా లేని భగవాన్ని నిలదీసి అడి గాడు రాజారావు.

తను తల్లిలేని వాడైనాడని శశిరేఖకు రాయలేదు రాజారావ్. ఎందుకంటే తనని ఓదార్చటానికి తప్పకుండా వస్తుందని. అలా వచ్చి శశిరేఖ మరో కొత్త రకం సమస్యను సృష్టించడం ఇష్టం లేకనే అతనామెకు రాయలేదు.

కర్మకాండలన్నీ సక్రమంగానే జరిగి పోయాయి.

ఆఖరి రోజు– రాత్రి... ఆ రాత్రి బాగా చీకటిగా వుంది రాజారావ్ హృద యం లాగే–


డాబా మీద ఒంటరిగా చీకట్లో ఓ మూలగా విసిరేసిన బొమ్మలా కూర్చుని పోయాడు రాజారావు. అప్పుడు కూడా అతను ఈ ఒక వరలో రెండు కత్తుల సమస్య గురించే ఆలోచిస్తున్నాడు,

సరిగ్గా అప్పుడే– ఏమంత పాదాల చప్పుడు లేకుండా అతడి దగ్గరకు ఒంటరిగానే వచ్చింది వెంకటలక్ష్మి.

చిన్నగా చాలా లోవాయిస్‌తో ఇలా అన్నది :

"బావా.... నువ్వింత దుఃఖంలో






వున్నప్పుడు ఈ విషయం గురించి మాట్లాడటం సమంజసం కాదని నాకు తెలుసు.... ఇది ఓ రకంగా నీకు బాధ కలిగించే విషయమే. ఐనా చెప్పక తప్పదు.... ఎందుకంటే ఇది నా జీవితా నికి సంబంధించినది....నన్ను క్షమించు బావా.... అత్తయ్య ఎన్నో ఏళ్ళుగా కోరుకుంటున్నట్టుగా నేను ఈ ఇంటి కోడలిని కాలేను. ఎందుకంటే నేను మరో మనిషికి మనసిచ్చాను. అతడినే చేసుకుంటానని మాట కూడా ఇచ్చాను. ఇది నిజం.... నన్ను క్షమించు.... స్వర్గంలో అత్తయ్య నన్ను శపిస్తుంది . ఐనా దాన్నే నేను దీవెనగా భావిస్తాను"

ఆ తర్వాత రెండు నిముషాలకు రాజారావ్ ఆ మాటల షాక్ నించి తేరు కోకముందే అక్కడి నుంచి వెళ్ళిపో యింది.

అతను వూహించలేదు... తన సమస్యకు ఇలా ఏమాత్రం వూహించ కుండానే పరిష్కారం లభిస్తుందని.... అసలు వెంకటలక్ష్మికే ఇష్టం లేనప్పుడు తను చెయ్యగలిగింది ఏముంది?

అంత కటిక చీకట్లోనూ అతడి కళ్ళ ముందు సన్నని కాంతి రేఖ నడుమ రెండు చేతులూ చాచి శశిరేఖ నవ్వుతూ నడవకుండనే పరిగెత్తుతూ ముందుకు వస్తోంది.

ఇప్పుడు– ఒక వర– ఒకే కత్తి.... రెండో కత్తికి మరో వర దొరికింది.

ఇలాగని తల్లిపోయిన దుఃఖంలోనూ తన సమస్యకు పరిష్కారం దొరికి నందుకు సంతోషం పొందాడు రాజా రావ్....

కానీ– అతడికి తెలియని నిజం ఒక్కటే–

వెంకటలక్ష్మి ఆ ఇంట్లో అప్రయి త్నంగానే తనకు దొరికిన శశిరేఖ–రాజా రావుకు రాసిన ప్రణయ లేఖలను చది విందనీ– పూర్తిగా పక్కా ఫార్ములా తెలుగు సినిమాల్లోలాగే తనూ అతడి కోసం త్యాగం చేసిందనీ రాజారావుకు వూహలోనైనా ఆ ఆలోచన కదల్లేదు.